ఉపాధి లేక...
'ఊరూరా వెతుకలాట'

తూర్పున వ్యవసాయ కూలీల వెతలు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి
టిఫన్‌లో సద్దికూడు.. తీసుకుని పంటచేలకుబోతే.. సందేళకు తిరిగొస్తాం.. అంత బువ్వ తిని సొమ్మసిల్లి పడుకుంటే తెల్లారేసరికి పంట చేలల్లో ఉంటాం.. కడుపు నింపుకోవడం కోసం పొట్ట చేతబట్టుకుని ఊరూరా తిరగడమే తెలుసు.. మా గొడ్డు కష్టానికి సరైన ప్రతిఫలం రాలేదని తెలిసినా ఎవర్నీ అడగలేకున్నాం.. వోల్లూ రైతులేకదాని ఊరుకుంటున్నాం.. మా బతుకులెప్పుడు మారుతాయి.. నాలుగు రాళ్లు ఎప్పుడు ఎనకేసుకునేది.. ఎప్పుడు పిల్లల్ని చదివించేది.. వాళ్ళనెప్పుడు ప్రయోజకుల్ని చేసేది. ఈ లోగా మా బతుకులే తెల్లారిపోతున్నాయంటూ తూర్పు మండలాల్లోని వ్యవసాయ కూలీలు వాపోతున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నవారు కేవీబీపురం మండలం రంగయ్యగుంట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు. రోజంతా పనిచేస్తే వీరికి గిట్టేది ఒక్కొక్కరికి రూ.700లు. వరి నారు పెరికి, కట్టలు పేర్చి, అడుసు పొలంలో వేసి, నాటు పూర్తి చేస్తే ఎకరా పొలానికి రైతు ఇచ్చేది రూ.550లే. పదిమందికి పైగా సభ్యులుగా వస్తున్న వీరు రోజుకు ఎన్ని ఎకరాల్లో వరి నాట్లు వేస్తారో, అంత మొత్తాన్ని అంతా సమానంగా పంచుకుంటారు. అలా వారికి రోజుకు రూ.700 నుంచి రూ.800లు మాత్రమే కూలి గిట్టుతుంది. ఇందులోనే వీరు ప్రయాణ ఖర్చులు కూడా భరించాల్సి ఉంటుంది. అయితే పురుషులతో సమానంగా ఆడవారికి కూడా కూలీ పంచడం వీరి ప్రత్యేకత. కాగా రోజంతా కష్టపడ్డా తమకొచ్చే కూలీ కుటుంబాన్ని పోషించడానికి ఏమాత్రం సరిపోవడం లేదని కూలీలు వాపోతున్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయనీ, కూరల్లో వాడే వెల్లుల్లి, ఉల్లిపాయ కొనడానికి కూడా మా కష్టం సరిపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కనీసం వ్యవసాయ పనులు కూడా లేవనీ, దీంతో పని పొరుగు గ్రామాలు, పక్క మండలాల్లో దొరికినా విధిలేని పరిస్థితుల్లో వెళ్ళి చేస్తున్నామంటూ వాపోతున్నారు. ప్రభుత్వం రైతులతో పాటు వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరుతున్నారు.

కనీసం రూ.1200లు కావాలి
సుబ్రమణ్యం, వ్యవసాయ కూలీ.
గ్రామంలో ఉపాధి పనులు సన్నగిల్లడంతో పొట్ట కూటి కోసం ఊరూరా తిరగాల్సి వస్తోంది. మా గ్రామంలో ఉపాధి పనుల్లేవ్. అలాగని వ్యవసాయ పనులు కూడా తక్కువే. బీసీలు, ఎస్సీలకు భూముల్లేవ్. మేమంతా కూలీ పనులు చేసుకుంటూనే ఊర్లు దాటి వస్తున్నాం. రోజంతా కష్ట పడ్డా కనీస కూలి గిట్టడం లేదు. రోజుకు రూ.1200లు గిట్టుబాటు కూలి ఇచ్చినా సంతోషమే.

'రెడ్ బుక్' పేరు వింటే
జగన్ వణుకుతున్నారు..

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారిని సోమవారం ఉదయం హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో అనితకు వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. చంద్రబాబు, పవన్, కూటమి నేతలు బాగుండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు దర్శనానంతరం హోంమంత్రి మీడియాకు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రజలు బాగుండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆమెతోపాటు టిడిపి నేత బిటెక్ రవి కూడా శ్రీవారిని దర్శిచుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడాక శ్రీవారి ప్రసాదాలు మెరుగుపడ్డాయని, బ్రేక్ దర్శన సమయం కూడా మార్పు చేస్తే బాగుంటుందని, ఈ విషయంపై సిఎం చంద్రబాబు దష్టికి తీసుకొని వెళ్తామని అన్నారు.

శ్రీవారిని దర్శనం తరువాత తిరుపతిలోని కపిలేశ్వర ఆలయంలో శ్రీకపిలేశ్వర స్వామివారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. హోం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో ఇబ్బందులు పెట్టిన వారి పేర్లు రెడ్ బుక్‌లో పెట్టామని, రెడ్ బుక్ పేరు వింటేనే జగన్ వణికిపోతున్నాడు. గత నాలుగు నెలల నుంచి ప్రజాసంక్షేమ కోసమే ఆలోచిస్తున్నామని, ఎన్డీయే ప్రభుత్వం కక్ష్య సాధింపుతో వ్యవహరించడం లేదని, జమిలి ఎన్నికలు వచ్చినా భయపడేది లేదని, ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి తీసుకురాలేని వైసిపి నేతలు ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.

తుడా చైర్మన్ పదవిపై నేతల్లో టెన్షన్

- టీటీడీ పాలక మండలిలో చోటు దక్కని వారు ముమ్మర ప్రయత్నాలు
- కూటమి నేతల్లో నిరాశ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:
టిటిడి పాలక మండలి మరో రెండురోజుల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో తిరుపతి నేతల్లో టెన్షన్ మొదలయ్యాయి. టిటిడి బోర్డు సభ్యులుగా టిడిపిలోని పలువురు నేతలు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. వారికి స్థానం దక్కకపోవడంతో తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) చైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న టెన్షన్ నేతల్లో ఎక్కువైంది.

తుడా చైర్మన్ పదవి దక్కించుకుంటే ఇటు టీటీడీలో ఎక్స్ అఫీషియో బోర్డ్ మెంబర్‌గా కొనసాగే అవకాశం ఉంది. దాంతోపాటు జిల్లాస్థాయిలో తుడా చైర్మన్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది. తుడా చైర్మన్ పోస్టు కోసం ఇట్లు టిడిపితో పాటు అటు జనసేన పార్టీ నేతలు, బిజెపి నేతలు కూడా కేంద్ర, రాష్ట్ర నేతలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. పదవులు తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఐదు నెలలు అవుతున్నప్పటికీ ఇంతవరకు తుడా చైర్మన్ పదవిని భర్తీ చేయలేదు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నుంచి తుడా చైర్మన్ పదవిని ఎక్కువ మంది ఆశిస్తున్నారు.

టిటిడి బోర్డులో స్థానం ఆశించిన వారికి పదవులు రాకపోవడంతో తుడా చైర్మన్‌పై దృష్టి పెట్టారు. ఇందులో టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో పాటు టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, జనసేన పార్టీ నుంచి కిరణ్ రాయల్, డాక్టర్ హరిప్రసాద్, బిజెపి నుంచి సామంచి శ్రీనివాస్, అజయ్ కుమార్ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుడా చైర్మన్ పదవి భర్తీ చేసేందుకు అనేక అంశాలను పరిశీలిస్తున్నారు. ఆ అంశాల ఆధారంగా చైర్మన్ పదవి నియమించాలని భావిస్తున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు చిత్తూరు జనసేన పార్టీ మహిళ పారిశ్రామికవేత్త కూడా తుడా చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గ నుంచి డాలర్ దివాకర్‌రెడ్డి కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఇటు నగరి నియోజకవర్గ నుంచి నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరులు కూడా చైర్మన్ పదవి ఈసారి శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అటు వెంకటగిరి ఇటు సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి కూడా తుడా చైర్మన్ పదవి తమ అనుచరులకు ఇవ్వాలని ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారు. చైర్మన్ పదవి కట్టబెట్టడానికి ఎక్కువ మొత్తంలో నేతలు ఆశిస్తూ ఉండడం వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పదవిని భర్తీ చేయడానికి అచితూచి వ్యవహరిస్తున్నారు.

తిరుపతి నేతల్లో టెన్షన్..
తుడా చైర్మన్ పదవి తిరుపతి నేతలకు ఇవ్వాలని కూటమి పార్టీలో ఉండే వారు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు తమపై ఎన్నో కేసులు నమోదు చేసి జైలుకు పంపడమే కాకుండా వైసిపి ఆగడాలను తట్టుకొని నిలబడి పార్టీకి పనిచేశామని, అలాంటి వారిని గుర్తించి తుడా చైర్మన్ పదవి ఇవ్వాలని అంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయంలో తుడా చైర్మన్ పదవి రెండుసార్లు చంద్రగిరి నియోజకవర్గానికి కేటాయించడం జరిగిందని, ఈసారి అలాంటి పొరపాటు చేయకుండా తిరుపతి నియోజవర్గంలో ఉన్న వారికే ఇవ్వాలంటున్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి చంద్రగిరి నియోజకవర్గ నుంచి రవి నాయుడుకి ఇవ్వడం జరిగిందని, తుడా చైర్మన్ మాత్రం తప్పకుండా తిరుపతి నియోజకవర్గంలో పార్టీకి కష్టపడిన వారికే ఇవ్వాలని అంటున్నారు. తుడా చైర్మన్ పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేస్తున్నారు

ఏవీఎస్ఓలు బదిలీ
సివిఎస్ఓ శ్రీధర్ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో పనిచేస్తున్న ఏవిఎస్ఓలు మాతృసంస్థకు బదిలీ చేస్తున్నట్టు సివిఎస్ఓ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీర్ఘకాలికంగా తిరుమలలోనే తిష్ట వేసిన విజిలెన్స్ ఏవీఎస్ఓలపై బదిలీ చేస్తున్నట్టు టీటీడీ సివిఎస్ఓ శ్రీధర్ తెలిపారు. శ్రీవారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న మనోహర్, మూడు నాలుగు సెక్టార్లో నిర్వహిస్తున్న సాయి గిరిధర్, శివయ్యలను మాతృ సంస్థకు బదిలీ చేశారు. అదేవిధంగా విజిలెన్స్ వింగ్‌లో విధులు నిర్వహిస్తు ఆరోపణలు ఎదుర్కొంటున్న పద్మనాభంలో మాతృసంస్థకు బదిలీ చేసినట్టు తెలిపారు.

'గిరిజనులకు భూములు చూపండి'



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి- దొరవారిసత్రం: మండల పరిధిలోని తనియాలి, ఏకొల్లు, ఆనేపూడి, కల్లూరు, మినమలమూడి గ్రామాల గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు భూములు చూపించాలని సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు నిరసన తెలిపారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల నుంచి గిరిజనులు తమ సమస్యలను తహశీల్దార్‌కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏకొల్లు సర్వే నెంబర్ 463, 22పి, తనియాలి సర్వే 01 పట్టాలు ఇచ్చారు కానీ భూములు చూపించకుండా మోసం చేశారని గిరిజనులు మండిపడ్డారు. పట్టాలు ఇచ్చిన గ్రామాల్లో పలు భూసమస్యలు పరిష్కరించకుండా భూమి చూపించకపోవడంతో నేడు నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో వివిధ రకాల భూ సమస్యలు, కొన్ని గ్రామాల్లో అటవీ సిబ్బంది అడ్డంకులు ఉన్నాయని, వీటన్నిటిని పరిష్కరించి ఇచ్చిన పట్టాలకు భూములు చూపాలని తహశీల్దార్ శైలకుమారికి వివరించారు. భూసమస్యలు పరిష్కరించలేని పక్షంలో కార్యాలయం ఎదుటే నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు మునయ్య, మనస్వామి, బాలకృష్ణ, బత్తయ్య, కృష్ణారెడ్డి, సరస్వతి గిరిజనులు పాల్గొన్నారు.

అత్యాచారాలకు పాల్పడే వారిపై
కఠిన చర్యలు తీసుకోవాలి: ఐద్వా వినతి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాలో రోజురోజుకు పసి పిల్లలు, మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని వీటిని అరికట్టాలని, అత్యాచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి డాక్టర్ పి. సాయిలక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరిగిన ఘటనలు అన్నీ పరిశీలిస్తే ఎక్కువభాగం మద్యం, డ్రగ్స్, గంజాయి మత్తులోనే జరిగాయని వీటిని నియంత్రించాలని డిమాండ్‌చేశారు. వడమాటపేట మండలం ఎం.పురంలో చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే బాలాయపల్లె మండలంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారం జరిగిందని పోలీసుస్టేషన్‌కు వెళితే గ్రామ సర్పంచి నలుగురుతో కలిసి మాట్లాడి రూ.30వేలు ఇప్పించి విషయం సద్దుమణిగేలా చేశారని ఇది చాలా దారుణమన్నారు. అత్యాచారం చేసిన నిందితుడితోపాటు గ్రామసర్పంచిపై కూడా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనలకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా కేసులు నడిపి త్వరగా శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

కనీస వేతనం అమలు చేయాలి
కలెక్టర్‌కి సిఐటియు వినతి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ పరిశోధన కేంద్రం, వెటర్నరీ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు మాట్లాడుతూ కొత్త వేతనం ప్రకారం ఒక్కొక్క కార్మికునికి రూ.538లు ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం వేతనం వస్తున్నా యూనివర్సిటీ యాజమాన్యాలు అమలు చేస్తున్న పరిస్థితి లేదన్నారు. వెంటనే అమలు చేయాలన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న వారందరికీ ఐడి కార్డు, ఈఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి, ముని రాజా, నాగరత్నమ్మ, మస్తాన్, పరశురాం, చక్రధర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు

- ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్వేష్
- స్పైసి పారడైస్‌లో తనిఖీలు - సీజ్

తనిఖీలు చేస్తున్న డాక్టర్ అన్వేష్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని స్పైసీ పారడైజ్ హోటల్లో నగరపాలక సంస్థ, ఫుడ్ సేఫ్టీ అధికారులు కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని గాంధీ విగ్రహం సమీపంలోని స్పైసి ప్యారడైజ్ హోటల్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీ చేసి తాత్కాలికంగా సీజ్ చేసినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తమ సిబ్బందితో పాటు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌తో కలిసి హోటల్‌ను తనిఖీ చేశామన్నారు. హోటల్లో అపరిశుభ్రంగా ఉండడం, స్టాక్ వద్ద భారీ సంఖ్యలో బొద్దింకలు ఉండడం, సేఫ్టీ నమూనాలు పాటించకపోవడం గుర్తించామన్నారు. ఆ మేరకు ప్రతినెలా పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, గోడలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, కిచెన్‌లో మూతలు కలిగిన పాత్రలు వాడాలని సూచించామన్నారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, కోల్డ్ స్టోరేజ్ సరైన పద్ధతిలో అమలు చేయాలని, వంట మనుషులు, పనిచేయువారు ఎలాంటి అంటూ వ్యాధులు లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు పొందాలి సూచించినట్లు తెలిపారు. స్టాకు కొన్నప్పుడు, వినియోగించినప్పుడు స్టాక్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని నగరపాలక సంస్థ లైసెన్సులు ఫుడ్ లైసెన్సులు కనపడే విధంగా ఉంచాలని, వినియోదారులకు నాణ్యమైన ఫుడ్ అందించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ హోటల్లో తీసిన ఆహార పదార్థాలు శాంపుల్స్ హైదరాబాదు ల్యాబ్‌కి పంపామని, మూడు వారాల లోపల రిపోర్ట్స్ వస్తాయన్నారు. తనిఖీల్లో కనుగొన్న లోపాలను సరిదిద్దుకోవాల్సిందిగా నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారు హోటల్‌లో తనిఖీల్లో తెలిపిన లోపాలను సరిదిద్ది తిరిగి తెరుచుకునేందుకు అనుమతి ఇస్తామని హెల్త్ ఆఫీసర్ తెలిపారు. ఆయన వెంట శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతీ ఉన్నారు.

నగరంలో రోడ్లపై గుంతలు ఉండకూడదు : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన వీధులు, చిన్న వీధుల్లో ఎక్కడా గుంతలు లేకుండా పూడ్చాలని కమిషనర్ ఎన్.మౌర్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో రోడ్లపై గుంతలు పూడ్చడం, గత వారం ప్రజల నుండి వచ్చిన వినతుల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 15 లోపు నగరంలో అన్ని వీధుల్లో గుంతలు లేకుండా పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పలుచోట్ల ఇంజినీరింగ్ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజల నుండి వచ్చిన వినతులను ఏ మేరకు పరిష్కరించారని తెలుసుకుని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత బాగా చేపట్టాలన్నారు. పెండింగ్ పన్నులు వసూళ్లు త్వరగా పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలో అనధికారిక లేఅవుట్లు, భవన నిర్మాణాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, డిసిపి మాహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవనశాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హసీమ్, డీఈలు, సూపరింటెండెంట్లు, ఏసిపిలు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జ్ చైర్మన్ సమీక్ష

ప్రజాశక్తి- క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఇంచార్జ్ చైర్మన్ ఆచార్య రామ్మోహన్ రావు సమీక్ష నిర్వహించారు. సోమవారం ఎస్వీయూ విసి కార్యాలయంలో ఇంచార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సమక్షంలో ఎస్వీయూ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు, పరిశోధన రంగంలో వృద్ధి అంశాలపై మాట్లాడారు. ప్రపంచస్థాయి ర్యాంకులు సాధించాలంటే పేటెంట్లు, ప్రపంచస్థాయి జర్నల్స్‌లో ప్రచురణలు మెరుగు పరుచుకునేందుకు గల మార్గాలను సూచించారు. అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకునేందుకు ఎస్వీయూ చొరవ చూపాలని, పరిశోధనా రంగంలో విదేశీ పరిశోధకుల బృందంతో కలసి పనిచేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో పిజి, పిహెచ్‌డి ప్రవేశాలకు సంబంధిత విశ్వవిద్యాలయాలే ప్రవేశపరీక్షలు, ప్రవేశాలు నిర్వహించేలా అనుమతించాలని విశ్వవిద్యాలయం అధికారులు కోరగా అందుకు సానుకూలంగా వున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాళ్లు ఆచార్య సుధారాణి, ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్య ఆర్వియస్ సత్యనారాయణ, ఆచార్య మోహన్ రెడ్డి, డీన్లు ఆచార్య చంద్రాయుడు, ఆచార్య కిశోర్,ఆచార్య బాలాజీ, ఆచార్య నరసింహ, దామోదర రెడ్డి, టాస్క్‌ఫోర్స్ మెంబర్లు ఆచార్య పద్మావతమ్మ, ఆచార్య భారతి, ఆచార్య రాజశేఖర్, మీడియా కో ఆర్డినేటర్ ఆచార్య పిసి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య దేవప్రసాద్ రాజు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య దేవ ప్రసాద్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు పరిపాలన భవనం ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఉదయం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆచార్య దేవ ప్రసాద్ రాజు 2007లో భౌతిక శాస్త్రంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరి, 2017లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. హాస్టల్ వార్డెన్‌గా, డిప్యూటీ వార్డెన్‌గా, ఏపీ ఆర్ సెట్ కన్వీనర్‌గా వర్సిటీలోని పలు హోదాలలో పరిపాలన బాధ్యతలను నిర్వహించారు. భౌతికశాస్త్ర విభాగాధిపతిగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆచార్య దేవప్రసాద్ రాజును భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నేతలు కామ్రేడ్ సీతారాం ఏచూరి పుస్తకాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, రవి, అశోక్, మాధవ కృష్ణ, నరేంద్ర, తదితరులు ఉన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల
బుక్ లెట్ ఆవిష్కరించిన టీటీడీ ఈవో

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 28వ తేదీ నుండి డిసెంబరు 6వ తేదీ జరుగనున్న కార్తీక బ్రహ్మోత్సవాల రోజువారి కార్యక్రమాల బుక్‌లెట్‌ను సోమవారం టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని ఈవో కార్యాలయంలో ఈవో మీడియాతో మాట్లాడారు. శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు. డిసెంబరు 2వ తేదీ గజవాహనం, 3న బంగారు రథం, 5న రథోత్సవం, 6వ పంచమితీర్థం వుంటుందని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవోలు గోవింద రాజన్, ప్రశాంతి పాల్గొన్నారు.

విమానాశ్రయాలకు ధీటుగా
రైల్వే స్టేషన్ల ఆధునీకరణ : సిఎం రమేష్

స్టాండింగ్ కమిటి సభ్యులతో ఎంపి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్‌లో భాగంగా దేశంలోని అన్ని రైల్వేస్టేషన్లను ఆధునికరించడం జరుగుతుందని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వేస్టేషన్లు కూడా కొత్త రూపును సంతరించుకోనున్నాయని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, కేంద్ర రైల్వే కమిటీ చైర్మన్ డాక్టర్ సిఎం.రమేష్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో కలిసి కేంద్ర రైల్వే కమిటీ సభ్యులు సోమవారం తిరుపతిలో సమావేశమయ్యారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణీకులకు మెరుగైన వసతులతో, అత్యున్నత ప్రమాణాలతో విమానాశ్రయాలకు ధీటుగా రాష్ట్రంలోని రైల్వేస్టేషన్‌లను తీర్చిదిద్దడం జరుగుతుందని, అవసరమైన ప్రదేశాలలో రైల్వేఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణం, ప్రజావసరాలకు అనుగుణంగా తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ సదుపాయం నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

పిఠాపురంలో వరదలు.. షూటింగుల్లో పవన్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : 'రోమ్ నగరం తగలబడి పోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించిన' చందాన పిఠాపురంలో వరదలు ముంచెత్తి ప్రజలు అవస్థలు పడుతుంటే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ షూటింగుల్లో బిజీగా ఉన్నాడంటూ మాజీ మంత్రి రోజా



శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మాజీ మంత్రి రోజా

విమర్శించారు. సోమవారం ఆమె శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విచ్చేశారు. దర్శనానంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలపై కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. హోంశాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసి వ్యాఖ్యలు సిగ్గుచేటు అన్నారు. పోలీసు అధికారులతో పని చేయించుకోలేని చేతకాని పరిస్థితులలో మంత్రులు ఉన్నారా.. అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ సరిగా పని చేయకపోతే ఆ వైఫల్యం ప్రభుత్వాన్ని దేనని అన్నారు. హోం మంత్రి అనితపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని అన్నారు. పేరుకే హోం మంత్రి గాని కనీసం కానిస్టేబుల్‌ని కూడా కదిలించలేని స్థితిలో అనిత ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే డైవర్షన్ పాలిటిక్స్‌కి కూటమి నేతలు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా శాంతిభద్రతలు, మహిళా రక్షణ పై ప్రభుత్వం దృష్టి సారించారని కోరారు. మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెరువులను కాలుష్యం నుండి కాపాడాలి

- రైతు సంఘం ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చెరువులను కాలుష్యం నుండి కాపాడాలని రైతు సంఘం నాయకులు కోరారు. చిల్లకూరు మండలం కడివేడు చెరువులోకి వ్యర్థాలు తెచ్చి కలుపుతున్న సన్న బోయిన హరినాథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామాల రైతులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం (ఎపికెఎస్) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి హేమంత మాట్లాడుతూ కడివేడు గ్రామ సమీపంలో నల్లటి కెమికల్స్‌తో కూడిన వ్యర్థాలను పెద్ద పెద్ద బ్యారెల్స్‌లో లారీల ద్వారా తెచ్చి పోస్తుండడంతో అవి పంట కాలువల ద్వారా చెరువులోకి ప్రవేశించి తెల్లగా వున్న నీళ్లు నల్లగా మారి చెరువులో ప్రవేశించడంతో చెరువు చేపలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఆ చేపలు తిన్న గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరారు, ఆ చెరువులో నీళ్లు తాగిన గోవులెన్నో మూగజీవాలు, పశువులు, మేకలు, గొర్రెలు, అక్కడికక్కడే మృతి చెందుతున్నాయని తెలిపారు. 2023, మే గతంలో 8వ తేదీ ఈ సమస్యపై ఆ గ్రామ రైతులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి గూడూరు ఆర్డీఓకి వినతి పత్రం ఇచ్చారన్నారు. అయినా సంబంధిత అధికారులలో చలనం లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు కడివేడు, కమ్మవారిపాలెం, తిమ్మనగారి పాలెం, ముత్యాలపాడు, నాంచారంపేట, పారిచెర్ల వారి పాలెం, చేడిమాల, తిప్పగుంటపాలెం, గ్రామాలకు చెందిన సుమారు 1500 ఎకరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని పంటల సాగును రైతులు ఆపివేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ ఈ విషయం పరిశీలించి చెరువును కలుషితం చేసి రైతులకు నష్టం కలిగిస్తున్న సన్నిబోయిన హరినాథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని గ్రామాలను కాలుష్య రహితం చేయాలని, రైతులు పంట సాగు చేసుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కెమికల్స్‌ను కలిపిన హరినాథ్ వద్దే చెరువును శుద్ధి చేయించి, డ్యాములు ద్వారా కొత్త నీటిని పంపి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు తల్లం ప్రసాద్, పెనుబోలు సాయి రెడ్డి, అభిలాష్ రెడ్డి, తిరుపతి సీనయ్య, సుమన్ రెడ్డి, వి గజేంద్రనాయుడు, పెంచలయ్య, ఎదనపర్తి కృష్ణారెడ్డి, రాధాకృష్ణ, కిరణ్, శీనయ్య, చంద్రమోహన్, నాయకులు బివి రమణయ్య, ఎస్ సురేష్, పి శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ముత్యాలయ్య, బి చంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏర్పేడు మండలంలోని చింతలపాలెం వద్ద సోమవారం చోటుచేసుకుంది. డక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి చెందిన తిక్కల్లోరి రామయ్య కుమారుడు తిక్కల్లోరి రమణయ్య (60) జీవాల వ్యాపారం నిమిత్తం చింతలపాలెంకు ద్విచక్ర వాహనంలో వెళుతూ రోడ్డును క్రాస్ చేస్తున్న సమయంలో వెంకటగిరి నుండి తిరుపతికి వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏర్పేడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏర్పేడు సిఐ జయచంద్ర తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని శివనాథపురంలో ఈ నెల 2వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితుడుని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. నాగరాజును బండరాయితో మోది హత మార్చిన రాజేష్ శివనాథపురం సమీపంలోనే సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగరాజు భార్యపై కన్నేసి అడ్డు తప్పించేందుకే హతమార్చినట్లు పోలీసులు విచారణలో రాజేష్ ఒప్పుకున్నాడని సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

మృత దేహానికి రి పోస్టుమార్టం

ప్రజాశక్తి- పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలో సోమవారం చిల్లకూరు పంచాయతీ వడ్డెపాలెం గ్రామానికి చెందిన బండ చెంచయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తెలిసిందే. అయితే చెంచయ్య మృత దేహానికి గతంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులు అనుమానం వ్యక్తం చేస్తూ హైకోర్టుని ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో తిరుపతి స్విమ్స్ కి చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు పర్యవేక్షణలో పెళ్లకూరు తహశీల్దారు ద్వారకానాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ బాయ్, ఎస్ఐ నాగరాజు, వీఆర్వో వంశీ పాల్గొన్నారు.

రోటరీ వెస్ట్ క్లబ్ చేయూత

పాఠశాలకు ఆర్థిక సాయం అందిస్తున్న దాత ఆర్యన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర పాఠశాలకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పది వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. దాత ఆర్వీ రత్నం చారిటీస్ నిర్వాహకులు శ్రీ కంటి రామ్మోహన్‌రావు మనుమడు ఆర్యన్ సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ రోటేరియన్ ఎల్లసిరిగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలన్నారు. శ్రీ కంటి సేవలు అభినందనీయమని కొని యాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ ధనుంజయ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శి నాగులు, గిరి బాబు, డివి బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, బాల రామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు సిపిఎం ప్రాంతీయ మహాసభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ మహాసభ ఈ నెల 6వ తేదీ స్థానిక పువ్వులపల్లి సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తామని పట్టణ కార్యదర్శి గంధం మణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అంబేద్కర్ కూడలి నుంచి సుందరయ్య భవన్ వరకు భారీ ర్యాలీ, అనంతరం మహాసభ ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయి నేతల సమక్షంలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందించే ఈ మహాసభకు పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల సభ్యులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన యూటీఎఫ్ బిఎన్ కండ్రిగ నాయకులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: యూటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా ఎస్ ఈశ్వరయ్య, అధ్యక్షులుగా బి కోదండరావు, సహాధ్యక్షులుగా ఎం చలమని, జి కవిత, ప్రధాన కార్యదర్శిగా ఎస్ సతీష్ కుమార్, కోశాధికారిగా పి గిరిబాబును ఎన్నుకున్నారు. మండల కమిటీ, మహిళా కమిటీ, ఆడిట్ కమిటీ, సిపిఎస్ కమిటీ, సాంస్కృతిక కమిటీ, సాంకేతిక కమిటీ, సలహా సంఘాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, శ్రీకాళహస్తి డివిజన్‌లోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, బివికండ్రిగ మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమకు బి ఎన్ కండ్రిగ మండల యూటీఎఫ్ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. యూటీఎఫ్ బిఎన్ కండ్రిగ మండల శాఖ ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తూ బలోపేతం చేస్తామని తెలిపారు.

'రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలి'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రకటించిన విధంగా రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని బిఎన్‌కండ్రిగ పంచాయతీ సెక్రటరీకి రైతు సంఘం (సిపిఐ) జిల్లా ఉపాధ్యక్షులు ఎ రామానాయుడు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ సచివాలయం సెక్రటరీకి కంచన పుత్తూరు సచివాలయం సెక్రటరీ మండలంలో ఉన్న రైతు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించామన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారని ఈ సాయాన్ని వెంటనే అందించాలని కోరారు. రబీ సీజన్‌లో రైతులకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. పంటల బీమా సొమ్ము ప్రభుత్వమే భరించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎన్ కండ్రిగ సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఎపిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తిరవి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ప్రెస్ క్లబ్ నూతన కార్యాలయ భవనాన్ని సోమవారం స్థానిక శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రారంభించారు. గతంలో ఏరియా ఆస్పత్రి వద్ద ఉన్న కాంటీన్ భవనంలో ప్రెస్ క్లబ్ నిర్వహించే వారు. అయితే టీడీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కాంటీన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మీడియా కోసం కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఓ సేవా కేంద్ర భవనాన్ని ప్రెస్ క్లబ్‌కు కేటాయించారు. దాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. శ్రీకాళహస్తి జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి. విజయకుమార్ నాయుడు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

'సమానత్వం కోసం మహిళల తపన' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్ గా పని చేస్తున్న డాక్టర్ విదాడల సౌభాగ్య రాణి రచించిన పుస్తకం 'అసంఘటిత రంగంలో సమానత్వం కోసం మహిళల తపన' వర్సిటీ ఉప కులపతి, రిజిస్ట్రార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్ లు మాట్లాడుతూ నిరంతరం పరిశోధనలు చేస్తున్న డాక్టర్ సౌభాగ్యరాణి ఈ పుస్తకం రచించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో మహిళల పాత్ర, పరిశ్రమ గురించి ఈ పుస్తకంలో చక్కగా వివరించారని కొనియాడారు. నిరంతరం పరిశోధించాలని తపన, కృషి ఆమెను పుస్తకం రచించే వైపు నడిపించాయని అన్నారు. ఈ పుస్తకం ఆమె రచించడం పట్ల విసి, రిజిస్ట్రార్ లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు సైన్స్ కళాశాల అధ్యక్షులు ఆచార్య కె. త్యాగరాజు, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సేవలు

గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మీపతి

మాట్లాడుతున్న గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మీపతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతులకు గ్రామీణ బ్యాంకు సేవలు అందుబాటులోకి తెస్తామని గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మీపతి పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'గ్రామీణ బ్యాంకులపై అవగాహన' సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామీణ ఉత్పాదకను, రుణ లభ్యతను పెంచడానికి గ్రామీణ బ్యాంకులు తోడ్పడతాయన్నారు. గ్రామీణ బ్యాంకు మేనేజర్లు సంగీత, శ్రీనివాస్ గ్రామీణ బ్యాంకులు అందించే వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగం డాక్టరు ఏ దేవకి, వి వాసవి, డాక్టరు జి తిరుమ లయ్య, వాసం తదితర అధ్యా పకులు, జి గంగయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజు), విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారిణి భారతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: రైతులకు రబీ సీజన్‌లో అవసరమైన వరి విత్తనాలు నాణ్యమైనవి అందించాలని, నాసిరకం విత్తనాలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను వ్యవసా యాధికారిణి భారతి హెచ్చరించారు. మండలం లోని వరి విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారిణి భారతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాల కోసం వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారని బుచ్చినాయుడు కండ్రిగలో మూడు దుకాణాల వద్ద ఈ వరి విత్తనాలు విక్రయిస్తున్నారని వారి వద్దే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని ఆమె దుకాణదారులను హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే రైతులు వ్యవసాయాధికారులకు తగు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు సుబ్బారావు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: ఎర్రవారిపాలెం క్రాస్ రోడ్‌లోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే రైతులకు విత్తనాలు అమ్మాలని దుకాణం యజమానులకు సూచించారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోట : కోట మండలంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి స్టాకు నిల్వలను స్థానిక మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోట మండలంలోని పలు విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రైవేటు దుకాణాలలో వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నాయుడుపేట : నాయుడుపేట లోని అన్ని విత్తన షాపులను వ్యవసాయ అధికారి జె గణేష్ సోమవారం తనిఖీ చేశారు. నాయుడుపేట విత్తన షాపుల్లోని స్టాకులకు సంబంధించి బిల్లు పుస్తకాలు, విత్తనాలు నాణ్యతపై తనిఖీలు నిర్వహించారు. నిర్ణీత ధరలకే విత్తనాలు విక్రయించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రామచంద్రాపురం: వ్యవసాయం చేసే రైతుల కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలమురుగన్ ట్రేడర్స్ ఎరువులు పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాన్ని (ఫర్టిలైజర్ దుకాణాన్ని) వ్యవసాయ అధికారిణి స్రవంతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుగు మందులు, విత్తన విక్రయ కేంద్రంలో సేల్స్ అండ్ స్టాక్ రిజిస్టర్ లను, ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకు రావాలని కోరారు.

మానసిక ఆరోగ్యం అందరికీ అవసరం

- సైకాలజిస్ట్ రేవతి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: శారీరక ఆరోగ్యంతో పాటు, మానసికమైన ఆరోగ్యం అందరికీ అవసరమని సైకాలజిస్ట్ రేవతి సూచించారు. ఆమె మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం కళాశాలలో 'మానసిక ఒత్తిడి అధిగమించడం -మానసిక ఆరోగ్యం' అనే అంశాలపై విద్యార్థినిలకు సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని వారి దినచర్యలో అకాలంగా మార్పులు రావడం, కారణం లేకుండా చికాకు, కోపం, వంటి ఉద్రేకాలకు లోను కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి దిగాలుగా ఉండటం, చికాకు, భయం వంటి వాటికి గురి కాకుండా జాగ్రత్తలు పాటించి, మానసికమైన ఒత్తిడిలను అధిగమించాలని సూచించారు. రోజువారి జీవన విధానంలో ఇతరులపై ఈర్ష్య పెంచుకోకూడదని, పగలు, ప్రతీ కారాలు సాధించాలని మనసును ఉద్రేకానికి లోను కాకుండా ధ్యానం వంటి వాటిని అవలంబించి మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రధానంగా పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు మెదడుకు అధిక ఒత్తిడి, అమితమైన ఆలోచనలు వంటి వాటిని దూరంగా వుంచి ఏకాగ్రతతో ఉత్తీర్ణత కావడానికి ప్రయత్నించాలన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక పరిశుభ్రత పాటిస్తూ, మానసిక ఆరోగ్యానికి 8 గంటలు గాఢ నిద్ర పొందాలని వారికి తెలిపారు. శారీరక, మానసిక, సామాజికంగా అన్నింటిని మన అదుపులో ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధించిన వారవుతారన్నారు. ప్రతి విద్యార్థి పగలు, ప్రతీకారాలు, ఈర్ష్యలు, కోపాలు, వంటి వాటికి దూరంగా ఉండాలని, పలు రకాల ఆలోచనలతో మానసిక ఒత్తిడిలకు గురికాకుండా మనసును అదుపులోకి చేసుకోవాలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పార్వతి, ఎంఎల్ హెచ్ పి మౌనిక, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎం దోరతి, శ్రావణి, ఆశ మంజుల పాల్గొన్నారు.

గిరిజనుల భూ సమస్యను పరిష్కరించాలి..

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఓజిలి : ఓజిలి మండలం కుందాం రాజుపాలెం గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వాలని తహశీల్దారుకు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాథ్, సిపిఎం నాయకులు శివకవి ముకుందా సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓజిలి మండలంలోని కుందాం గిరిజనులు నాలుగు తరాల నుండి నివసిస్తున్నారని, వారికి సెంటు భూమి కూడా లేదని మండలంలో ఎంతమంది తహశీల్దారులకు అర్జీలు ఇస్తున్నా వారి సమస్యలను అధికారులు పట్టించుకో కోవడం లేదన్నారు. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం భూములు మొదట ప్రాధాన్యత గిరిజనులకు ఇవ్వాలని చట్టాలు వున్నా గిరిజనులని పట్టించుకోకుండా అగ్రవర్ణాల వారు సాగు భూములు ఏర్పాటు చేసుకుంటున్నప్పటికీ అధికారులు వారికి సహకరిస్తు న్నారని తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుం దామని భూమిలోకి పోతే వారిని అడ్డుకుంటున్నారని ఈ విధానం సరి కాదని వారికి వెంటనే సాగు పట్టాలు ఇచ్చి సాగుకు అనుమతులు కల్పించాలని లేని పక్షంలో తిరుపతి జిల్లాలో ఉన్న గిరిజనులందరూ ఓజిలి మండల కేంద్రానికి తరలి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తుపాకుల మనీ, ఎం మణెమ్మ, రాపూరు దేవి పాల్గొన్నారు.

రోజాపై కఠిన చర్యలు తీసుకోవాలి..

పోలీసులకు తెలుగు మహిళల ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణ చేసిన మాజీ మంత్రి రోజాపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళలు పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో.పోలీసు స్టేషన్‌లో తెలుగు మహిళలు ఎస్ఐకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ.. తిరుపతిలో జరిగిన వైసీపీ బహిరంగ సభలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా ముఖ్యమంత్రి చంద్రబాబుపై, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌పై, హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్య లు, నిరాధార నిందారో పణలు చేశారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, కార్యనిర్వాహక కార్యదర్శి, 27వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ బసంతి, 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి, తెలుగు మహిళలు నాగరత్నమ్మ, భారతి, మోహన, రజిని, సంధ్య పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: పంచాయతీల సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయేది వర్షాకాలం అని, ప్రతి పంచాయతీలో పారిశుధ్య లోపం లేకుండా నిర్వహణ సక్రమంగా చూడాలని అన్నారు. రాబోయే మండల సర్వసభ్య సమావేశంలో ఏ పంచాయతీలో ఏ సమస్య ఉందో నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. దాని ద్వారా నిధులు సమ కూర్చుకొని సమస్యలను పరిష్క రించటం సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్, ఆయా శాఖల అధి కారులు పాల్గొన్నారు.

పాము కాటుతో విద్యార్థి మృతి

పాముకాటుతో మృతి చెందిన చరణ్

ప్రజాశక్తి -వాకాడు: పాముకాటుతో విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బాలిరెడ్డి పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన పంట్రంగం మస్తానయ్య కుమారుడు పదవ తరగతి విద్యార్థి పంటరంగం చరణ్ (15) పాముకాటుకు గురై మృతి చెందాడు. ఆదివారం రాత్రి బాలిరెడ్డిపాలెం లోని తన ఇంట్లో చరణ్ పాము కాటుకు గురయ్యాడు. బాలిరెడ్డి పాలెంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం చరణ్‌ను తీసుకెళ్లగా ఆస్పత్రి మూసివేసి వుండడంతో హుటాహుటిన గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చరణ్ ఆరోగ్య పరిస్థితి విషమించింది. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడని మృతుని బంధువులు తెలిపారు. బాలిరెడ్డి పాలెం లోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం అది ఉంటే చరణ్ ఆరోగ్యం క్షీణించి ఉండేది కాదని, అక్కడ వైద్యం అందకపోవడం వల్ల మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై స్పందన

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: రైతులు పండించిన పంటను, ఏటీఎం మోడల్ వేసిన కూరగాయలు , ఆకుకూరలు స్పందన కార్యక్రమంలో సోమవారం విక్రయించారని మంచి స్పందన వచ్చిందని ఎంపిడివో త్రివిక్రమరావు పేర్కొన్నారు. మండలంలో ఎంపిడివో త్రివిక్రమ రావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజింగ్ న్యాచురల్ ఫామింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి త్రివిక్రమరావు మాట్లాడుతూ ప్రకృతి కూరగాయల వల్ల అనేక రోగాలకు దూరమవుతారని మంచి ఆరోగ్యం వస్తుందని ప్రకృతి వ్యవసాయంతో అధిక సంపాదన వస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారానే కూరగాయలు పండించి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారిణి భారతి, ఏపిఎం మునెయ్య, వివోపిఆర్‌డి రాజశేఖర్, వెంకటాచలం, జయలక్ష్మి, ఆశ , రజిని, రేవతి, భారతి, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న వైనం న్యూ మంగళం పంచాయతీలో చోటు చేసుకుంది. మంగళం పరిధిలోని న్యూ మంగళం పంచాయతీ మంగళం చెరువును ఈ ఏడాది చెరువులో నీళ్లు లేని కారణంగా జనవరి మాసంలో ఆలస్యంగా నిర్వహించిన వేలంలో (పసలి సంఖ్య 1433) ద్వారా గంగాధరం 9 లక్షల 50 వేల రూపాయలకు చెరువును దక్కించుకున్నారు. అయితే నష్టం వాటిల్లిందని అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. రెన్యువల్ చేయాలని ఉన్నతాధికారులకు పెట్టుకున్న అర్జీ పై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే పంచాయతీకి ఎటువంటి నగదును చెల్లించకుండానే చెరువులో చేపలు పడుతున్నారని స్థానికంగా ఉన్న సమాచారం. పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు స్పందించకపోవడం పట్ల స్థానికంగా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా పంచాయతీ అధికారి ఈ మోసాన్ని గుర్తించి విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ టి.చైతన్య వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సును విద్యార్థులకు హ్యూమానిటీ బ్లాక్ లోని సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎమ్. గణేష్ కుమార్ విచ్చేసి వ్యక్తిత్వ వికాసం లక్షణాలు, వివిధ రకాలైన వ్యక్తిత్వ వికాసాల లక్షణాలను వివరించారు. విద్యార్థినులు భావోద్వేగాలను సమతుల్య పరచవలసిన సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుంటూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని వారి వృత్తిపరంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్నారు..'

మాట్లాడుతున్న టిడిపి నాయకులు ఈశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి టిడిపి క్యాడర్‌లో చిచ్చు పెట్టేందుకు చూస్తున్నారని టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం తిరుపతి రూరల్ మండల పరిధిలో నిర్వహించిన వైసిపి చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. తన కుమారుడు ఓటమికి టిడిపికి చెందిన కొందరి పేర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపికి చెందిన వారు ఆ పార్టీ అభ్యర్థి గెలుపునకు పనిచేస్తారే గాని అవతలి పార్టీ వారికి ఎలా పనిచేస్తారని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన ఆరోపణలు చాలా విడ్డూరంగా ఉన్నాయన్నారు. తన గురువు అయిన భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అభినయ రెడ్డికి ఎమ్మెల్యే టికెట్లు రానీవ్వకుండా తెరవెనుక ప్రయత్నాలు చేయడం వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. జిల్లాలోనే కాదు, రాష్ట్రంలో కూడా ఎవ్వరూ అనుభవించని ఐదు పదవులను చెవిరెడ్డి ఒక్కరే అనుభవించారన్నారు. తన కుమారుడిని పసికందుతో పోల్చి ఇంత మంది కలిసి ఓడించారని టిడిపి నేతల పేర్లు చెప్పడం చూస్తుంటే టిడిపి క్యాడర్లో వర్గపోరు సృష్టించడానికే అని తేటతెల్లమైందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ఎమ్మెల్యే పులివర్తి నాని కృషి చేస్తున్నారన్నారు. వైసిపి క్యాడరుపై ఇప్పటి వరకు 'మేము ఒక్క కేసు అయినా అక్రమంగా నమోదు చేయించామా?' అని ప్రశ్నించారు. ఇకనైనా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి సహరించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి రమేష్ రెడ్డి, కత్తి సుధాకర్, మధు, కన్నయ్య నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాఫియా కట్టడికే గంగా ప్రసాద్‌పై ఆరోపణలు

- టిడిపి కోఆర్డినేటర్ శ్రీపతి బాబు

మాట్లాడుతున్న టిడిపి కో ఆర్డినేటర్ శ్రీపతి బాబు

ప్రజాశక్తి - సత్యవేడు: మాఫియా కట్టడికే గంగా ప్రసాద్‌పై ఆరోపణలు చేస్తున్నారని నియోజకవర్గ టిడిపి కో ఆర్డినేటర్ శ్రీపతి బాబు పేర్కొన్నారు. ఇటీవల వైసిపి అనుకూల మీడియాలో సూళ్లూరుపేటకు చెందిన పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్ సత్యవేడు నియోజకవర్గంలో పెత్తనం చెలాయి స్తున్నారని వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన శ్రీపతి బాబు సోమవారం స్థానిక టిడిపి మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి నివాస గృహంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆ కథనాలను ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగా ప్రసాద్ 30 ఏళ్లుగా రాజకీ యాల్లో ఉన్నారన్నారు. ఏనాడు ఏ పదవులు ఆశించకుండా పార్టీకి నిస్వార్థంగా ఆయన సేవలు చేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా వైసిపి పాలనలో ఇసుక, గ్రావెల్, క్వారీలపై పెత్తనం చెలా యించిన మాఫియా కను సన్నల్లో మెలుగుతున్న వైసిపి అనుకూల మీడియా సదరు మాఫియా కళ్లల్లో ఆనందం చూసేందుకే ఇలాంటి చవక బారు ఆరోపణలు చేస్తూ వార్తలు రాయడం సమంజసం కాదన్నారు.గంగా ప్రసాద్ పై తప్పుడు రాతలు రాస్తే చూస్తూ ఊరుకోబోమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, రామానుజుల నాయుడు, గోపీనాథ్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, పరమశివం, నరసరాజు, ఎండి కుమార్, షణ్ముగం, చిన్న, పాల్గొన్నారు.

పాలియేటివ్‌పై ఎస్‌బిఐసిసిఎఆర్ అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వా న్స్‌డ్ రీసెర్చ్ (ఎస్విఐసిసిఎఆర్) తిరుపతి, ఆంకాలజీలో పాలియేటివ్ కేర్ ముఖ్యమైన పాత్ర గురించి అవగాహన కల్పించ డానికి ఒక విద్యా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూ టివ్ టాటా మెమోరియల్ సెంటర్ మాజీ డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజీ హెడ్ డాక్టర్ రాజేంద్ర ఎ. బద్వే మాట్లాడుతూ 70 శాతం మంది రోగులలో వ్యాధి ముదిరిన దశలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ జరుగుతున్న చోట, పాలియేటివ్ కేర్‌కు భారతదేశంలో డిమాండ్ పెరుగుతోందన్నారు. మనం ఒక ప్రాంతాన్ని, స్థానిక సమాజాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఉప శమన సంరక్షణ వ్యూహాలను రూపొందించాలి, ప్రస్తుత చికిత్స నమూనాలో దాన్ని సజావుగా చేర్చాలి. ఇది రోగుల జీవన నాణ్యతకు సంబంధించి కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం పది లక్షల కంటే ఎక్కువగా కొత్త క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నాయి. వాటిలో అత్యధికులు వ్యాధి ముదిరిపోయిన దశలలో మాత్రమే వైద్య సంరక్షణను ఆశ్రయిస్తున్నారు. అది వారిని ఉపశమన సంరక్షణ అవసరమయ్యే వారిగా చేస్తోందని తెలిపారు . క్యాన్సర్ కేసులు పెరుగుతుండడం, చివరి దశలో వాటిని గుర్తిం చడంతో, సమ గ్రవంతమైన రీతిలో నొప్పి, ఉపశమన సంరక్షణ సేవలకు డిమాండ్ పెరుగుతోంది. క్యాన్సర్ రోగు లలో పాలియేటివ్ కేర్ అవసరం అయ్యే వారు ప్రతీ 100,000 మందికి 70 నుండి 140 వరకు ఉంటారని అంచనా. అయి నప్పటికీ, భారతీయుల్లో 4 శాతం కంటే తక్కువ మందికి మాత్రమే ఈ కీలకమైన ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉందన్నారు. టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ భారతదేశంలో ఉన్న క్యాన్సర్ కేర్ సవాళ్లను గుర్తిస్తుంది. రోగుల ఇళ్లకు సరసమైన, అధిక-నాణ్యత కలిగిన ఆంకోలాజికల్ సేవలను తీసుకువెళ్లేందుకు తనను తాను అంకితం చేసుకుంది. సమగ్రత, కరుణ, సంరక్షణతో కూడిన తాత్వికత విలువలతో మార్గనిర్దేశం చేశారు. ఇది దేశమంతటా ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. రోగి-కేంద్రీకృత విధానాలు, వినూత్న సాంకేతికతను ఉపయోగిస్తోంది. దీని సంరక్షణ నమూనా క్యాన్సర్ లక్షణాల గురించి అవగాహన పెంచడానికి, సకాలంలో స్క్రీనింగ్‌కు తగిన ప్రాముఖ్యతను ఇస్తుంది. ముఖ్యంగా అట్టడుగు స్థాయిలలో, ప్రారంభ దశలోనే గుర్తిస్తారన్నారు. ఉపశమన సంరక్షణ అవసరాన్ని తగ్గిస్తుందని వెల్లడించారు. విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, పుట్టపర్తి వంటి కొన్ని కీలక కేంద్రాలలో పాలియేటివ్ కేర్ సేవలను విస్తరించడంలో ఆంధ్రప్రదేశ్ పురోగతి సాధించినప్పటికీ, ఈ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి అటువంటి సంరక్షణ కేం ద్రాలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మరింత అభివృద్ధి చేయడం చాలా అవసరం అన్నారు. రాయలసీమతో పాటుగా తమిళ నాడు, కర్ణాటకలోని పొరుగు ప్రాంతాలలో 24/7 ఉపశమన సహాయాన్ని అందిస్తున్న ఏకైక ఆసుపత్రిగా ఎస్వీ సీసీఏ ఆర్ అనేది స్థానికులకు మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉంది. డాక్టర్ రవికుమార్, అతని బృందం నేతృత్వం లోని పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ విభాగం ద్వారా శ్రద్ధగల ప్రయత్నాలతో మరింత మంది బాధిత రోగులను చేరుకుంటుందన్నారు. రోగులు ఈ అవకాశాన సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నై చెందిన పాలియేటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ మల్లికా తిరువదనన్, తిరుపతి టాటా హాస్పిటల్స్ సర్జికల్ అంగాలజీ హెడ్ డాక్టర్ నరేంద్ర హులికల్, డాక్టర్ వి సురేంద్రన్, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణంపై గ్రామసభ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వారం రోజులుగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'అవినీతి రహిత సమాజాన్ని ఏ విధంగా స్థాపించాలి?' అనే అంశంలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే ఈరోజు విజిలెన్స్ అవేర్నెస్ వీక్, రాష్ట్రీయ సేవా సమితి, ఎన్.ఎస్.ఎస్ యూనిట్-2 ద్వారా తిరుపతి జిల్లాలోని నారావారిపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ సెల్ కోఆర్డినేటర్ డా.ఏ చందులాల్ మాట్లాడుతూ అవినీతిని మనం ఏ విధంగా ఎదుర్కోవచ్చు? విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ద్వారా అవినీతిని ఎదుర్కొనేందుకు మనకు సలహాలు సూచనలు ఏమిటి? అనే అంశం పైన వివరించారు. ఈ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ను నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించవచ్చని తెలిపారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ అడిషనల్ కోఆర్డినేటర్ డా. సీతారాం శర్మ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కనపాల కుమార్ మాట్లాడుతూ అవినీతిని మనం గ్రామ స్థాయి నుంచి ఎదుర్కొనడం మొదలు పెడితే మన ఊరు, మన ప్రాంతమంతా ఉన్నత అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని, అవినీతిని ప్రశ్నించడంలో ఎట్టి పరిస్థితుల్లో మనం వెనకడుగు వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ సహాయకుడు బి.రవి నాయుడు, నారావారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

డిజిని సన్మానిస్తున్న అప్సా నాయకులు

డిజికి ఘన సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):తిరుపతి పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాపరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్ లో ఫైర్ సేఫ్టీ సమస్యలను డీజికి వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించారని సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకేష్, బాబా రమేష్, మురళి, చంద్ర, రవి కుమార్ పాల్గొన్నారు.

పుత్తూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా: డిఎస్‌పి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రైల్వే స్టేషన్ లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని రైల్వే రేణిగుంట డిఎస్‌పి హర్షిత అధికారులను ఆదేశించారు. సోమవారం పుత్తూరు రైల్వే స్టేషన్ ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో ఎలాంటి నేరాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రైలు నుంచి మత్తు పదార్థాలు రవాణా జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ యశ్వంత్ కుమార్, ఎస్‌ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'విజిలెన్స్ అవేర్నెస్ వీక్'

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు గతవారం రోజులుగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో నిర్వహిస్తున్న విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమం సోమవారం విశ్వవిద్యాలయంలోని ప్రముఖ చెలికాని అన్నారావు సభా భవనం లో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయ విసి ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి విజిలెన్స్ అవేర్నెస్ కార్యక్రమ ముఖ్యోద్దేశాన్ని వివరించారు. ఆయన మాట్లాడుతూ మన భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా నిర్మాణం చేయడమే ఈ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ లక్ష్యం. ప్రస్తుత కాలంలో ప్రతి చోటా అవినీతి మహమ్మారిగా వ్యాపించిందని ఆ అవినీతిని మనం కూకటివేళ్లతో పెకిలించి, ఉత్తమ నీతి సమాజాన్ని స్థాపించాలని ఆయన ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా నైతిక బాధ్యత కలిగి వారు చేసే కార్యాలలో నిబద్ధత కలిగి ముందుకు వెళితే అవినీతికి ఆస్కారమే లేదని వివరించారు. అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో బహుమతులు పొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సును అమలు చేయాలి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మునివేలు పేర్కొన్నారు. నగరి నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి మునివేలు నియోజక వర్గం ఇన్‌ఛార్జ్ వావిళ్ల శివయ్య ఆధ్వర్యంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ల సిఫార్సు మేరకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని పుత్తూరు, వడమాల పేట తహశీల్దారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌర హక్కుల దినం క్రమం తప్పకుండా దళిత గ్రామాలలో అన్ని డిపార్ట్మెంట్ అధికారులతో జరిపి గ్రామాల్లో నెలకొన్న అంటరానితనాన్ని పోగొట్టేలా ఈ సమావేశాన్ని మండల తహశీల్దారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోరారు. రెండు మండలాలు పుత్తూరు, వడ మాల పేట మండలాల తహశీల్దారులకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ పుత్తూరు మండలం అధ్యక్షుడు నీరుపాకు వినోద్ కుమార్ , వడమాలపేట మండలం అధ్యక్షుడు వావిళ్ల అజిత్ , ఉపాధ్యక్షుడు దాము, గోవిందరాజులు, మణి పాల్గొన్నారు.

గుండోడు కనుమ రోడ్డు ఏర్పాటుకు పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: పూర్వం కార్వేటినగరం రాజులు రాకపోకలు సాగించిన గుండోడు కనమ రాజుల బాటకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో నేటికీ మహర్దశ ప్రాప్తించనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రాపురం మండలం నెన్నూరు నుండి తాటి తోపు కండ్రిగ వరకు ఉన్న గుండోడు కనుమ రోడ్డు అభివృద్ధికి చంద్రగిరి నియోజకవర్గ పంచాయతీరాజ్ డిఈ ప్రభాకర్ రెడ్డి, ఏఈ చిన్నయ్యలు సోమవారం పరిశీలించారు. 2021లో వచ్చిన భారీ వర్షాలకు రాయల చెరువు పూర్తిగ నిండటంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆ సమయంలో గుండోడు కనుమ రాజుల బాట ప్రజల రాకపోకలకు ఎంతో దోహద పడింది. ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామాలకు వచ్చిన సందర్భంలో ప్రజలు గుండోడు కనుమ రాజ బాటను గురించి ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. కార్వేటి నగరం రాజులు శిస్తు వసూలు చేయటానికి తాటి తోపు కండ్రిగ నుంచి నెన్నూరు వరకు గుండోడు కనుమ లో రాళ్లు పేర్చి బాట ఏర్పాటు చేశారని, అటు పిమ్మట తమిళనాడు నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే శ్రీవారి భక్తులు కూడా ఈ దారినే నడిచి తిరుమలకు వెళ్లే వారిని వివరించారు. రామచంద్రాపురం, రాయల చెరువు,కుప్పం బాదురు మార్గంలో రోడ్లు భవనాల శాఖ రహదారి ఏర్పాటు చేయడంతో గుండోడు కనుమ దారి మనుగడలో లేకుండా పోయిందని తెలిపారు. రాయల చెరువు నిండిన సమయంలో ప్రధాన రహదారి పూర్తిగా నీటమునుగు తున్నందున గుండోడు కనుమ రహదారి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు కోరిన విధంగా రహదారిని అభివృద్ధి చేయటానికి ఎమ్మెల్యే నాని పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వివరంగా చర్చించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని కోరిక మేరకు అధికారులు తాటితోపు కండ్రిగ నుంచి గుండోడు కనుమ లోని పాత రాజబాట ద్వారా నెన్నూరు వరకు నడిచి వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ డి ఈ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే తిరుపతి పచ్చికాపల్లం మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని చెప్పారు. 2.5 కిలోమీటర్ల దూరం ఉందని దీనికి అంచనాలు తయారు చేసి ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు మొదలు పెట్టడానికి చర్యలు చేపడతామన్నారు. పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు గుండోడు కనమను పరిశీలించడంతోనే పురాతన రాజుల బాటకు మహర్దశ ప్రాప్తించే క్రమం లో మొదటి అడుగు పడిందని ఈ ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చటంలో భాగమేనన్నారు.

తాగునీరు వృథా..!

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ నీలావారిపల్లె గ్రామం నందు త్రాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు వృధాగా పోతూ రోడ్డుపైన ప్రవహిస్తూ ఉన్నాయి. నీలావారిపల్లె, గన్నవారిపల్లె గ్రామాలకు త్రాగునీటిని సరఫరా చేసే పైప్ లైన్ గత ఐదు రోజుల క్రితం పగిలిపోయింది. దీంతో రెండు గ్రామాలలోని గృహాలకు తాగునీటిని సరఫరా చేసేటప్పుడు నీరు వృధాగా పోతూ ఉండడం, రోడ్డుపై ప్రవహిస్తూ ఉండడం కనిపిస్తూఉంది. పంచాయతీ వారు స్పందించి పైపులైన్ బాగు చేసి తాగు నీటిని వృధా కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వృధాగా రహదారిపై పోతున్న తాగునీరు

మానవ కంప్యూటర్‌గా శకుంతలాదేవి

- ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం వేణు రెడ్డి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మానవ కంప్యూటర్ శకుంతల దేవి అని ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం వేణు రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని టేకుమంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో మానవ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలా దేవి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం వేణురెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు దేవకీ, కేశవులు మాట్లాడుతూ శకుంతలదేవి గణితంలో ఎన్నో పరిశోధనలు చేపట్టి గణితమును సులభతరంగా చేశారని ఆమె సేవలు గణితానికి మరవలేనిది అన్నారు. విద్యార్థులు శకుంతలదేవి జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, వెంకటస్వామి, వెంకటరమణ, జయప్రకాష్, విజయకుమారి, అన్నపూర్ణ దేవి, శుభలక్ష్మిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని సూరయ్యగారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్బాల్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ తెలిపారు. బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమాను పెంట పాఠశాలలో అండర్ 14, అండర్ 17 సాఫ్ట్బాల్ సెలక్షన్స్ నిర్వహించగా 14 విభాగంలో ఎం మధుప్రియ 8తరగతి, అండర్ 17 విభాగంలో మహా విష్ణువర్ధన్9 తరగతి, స్టాండ్ బయల్గా అనన్య, అనీయ రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారని తెలిపారు. అండర్ 14 విభాగంలో పాల్గొనే వారు అరగొండ అపోలో స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని, అండర్ 17 విభాగంలో పాల్గొనే అబ్బాయిలు గుంతకల్‌లో అండర్ 17 విభాగంలో పాల్గొనే అమ్మాయిలు కాకినాడలో ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఆధార్ సవరణల కోసం కిక్కిరిసిన సచివాలయం

ప్రజాశక్తి-సోమల: పాఠశాలల్లో, కళాశాలలో చదివే విద్యార్థుల పూర్తి వివరాలను ఆపార్‌లో నమోదు చేసే నిమిత్తం ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నిబంధనల ప్రకారం మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు తమ ఆధార్ కార్డులోని వివరాలు స్కూల్ రికార్డులోని వివరాలు జనన ధ్రువీకరణ పత్రంలోని వివరాలు అన్ని ఒకేలా ఉండే విధంగా నమోదు చేయాల్సి రావడంతో చాలామందికి ఆధార్లో ఒక విధంగా పాఠశాల రికార్డులలో మరో విధంగా జనన ధ్రువీకరణ పత్రంలో ఇంకో విధంగా ఉండడంతో వీటి సవరణల కోసం అటు పాఠశాలలకు, సచివాలయాలకు, మీ సేవా కేంద్రాలకు, రెవిన్యూ మరియు ఎంపీడీవో కార్యాలయాలకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని బజారు వీధిలో ఉన్న సచివాలయంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆధార్ సవరణల కోసం అధిక సంఖ్యలో రావడం కనిపించింది. ఆవుల పల్లె సచివాలయంలోని ఆధార్ సెంటర్లో వివరాలు నమోదు చేసే సచివాలయ ఉద్యోగి బదిలీపై వెళ్లడంతో మరొకరు ఆస్థానంలో బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎవరు రాకపోవడంతో పెద్ద ఉప్పరపల్లి ఆవులపల్లి అన్నెమ్మ గారి పల్లి సోమల, ఇరికిపెంట, సూరయ్యగారిపల్లి తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు సోమల సచివాలయానికి వచ్చి గంటల తరబడి వేసి ఉండి తమ రికార్డులను సరిచూపించుకుని సవరణలు చేయించుకొని వెళ్లడం కనిపించింది. కాగా పూర్తి వివరాలు అన్ని సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాల్సి రావడంతో తల్లిదండ్రులు విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలు ఆందోళనగా కనిపించడం కనిపించింది.

సోమల సచివాలయంలో దృశ్యం